క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: సీజనల్ వ్యాధులకు గురికాకుండా ఉండాలంటే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. బుధవారం ఈపురుపాలెం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాగిజావ, ఖర్జూరం, పాలు, కోడిగుడ్లను ఆహారంగా తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల సంఖ్య పెంచండి

చీరాల టౌన్: వలసలు నిర్మూలించి కూలీలందరికీ ఉపాధి కల్పించాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకంపై సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించాలన్నారు. పంచాయతీల్లో గుర్తించిన పనుల వివరాల నివేదికలు అందించాలని సూచించారు. ఏపీవో దాసు, జేఈ, ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల అందజేత



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్

చీరాల అర్బన్: ఈపురుపాలెంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ పథకం కింద పాఠశాలలోని ఐదుగురు విద్యార్థినులకు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.గుణ్ణేశ్వరరావు, దామర్ల మనీషా మాట్లాడుతూ విద్యార్థినులు పాఠశాలకు సకాలంలో హాజరై ప్రతిభావంతులుగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్ టి.వెంకటేశ్వర్లు, స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారులకు ఆరోగ్యం

వేటపాలెం: చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్. విజయమ్మ సూచించారు. కొత్తపేటలో జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. గర్భిణులు వైద్యశాల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ స్వాతి కిరణ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అద్దంకి సీమ బ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

అద్దంకి రూరల్: అద్దంకి సీమ బ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని స్థానిక 99 అడుగుల ఆభయాంజనేయ స్వామి విగ్రహం వద్దనున్న కార్యాలయం వద్ద బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా శ్రీపతి రంగనాథాచార్యులుచే సింగరకొండ దేవస్థాన పురోహితులు వంగల హరిశంకరావధాని ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడుగా హనుమంతరావు, సహాధ్యక్షుడిగా వామరాజు వెంకటేశ్వరరావు సహా పలువురిని ఎన్నుకున్నారు. స్వర్ణ సుబ్బారావు, అన్నపూర్ణపాల్గొన్నారు.

26న సాహిత్య సమావేశం

అద్దంకి: పట్టణంలోని కాళికా సమేత కమలేశ్వర ఆలయంలో ఈ నెల 26న సాయంత్రం సృజన సాహిత్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సృజన బాధ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశభక్తితో కూడిన కవితల కవి సమ్మేళన కార్యక్రమాన్ని డాక్టర్ యు. దేవపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్యం అధ్వానం

- అధ్వానంగా దండుబాట ప్రధాన మురుగు కాలువ
- ప్రధాన కాలువపై మూతలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు
- గతంలో కాలువలోపడి ఇద్దరు చిన్నారులు, పది గేదెలు మృతి
- చలించని అధికారులు, ప్రజా ప్రతినిధులు



మూతలు లేకుండా ప్రమాద భరితంగా ఉన్న దండుబాట ప్రధాన మురుగుకాలువ

చీరాల రూరల్: నియోజకవర్గ కేంద్రం చీరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. మురుగు కాలువలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యంగా దండుబాట ప్రధాన మురుగుకాలువ ప్రమాదభరితంగా మారింది. కాలువపై మూతలు లేకపోవడంతో ప్రజానీకంతో పాటు వాహన చోదకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలువలోపడి ఇద్దరు చిన్నారులు చనిపోవడంతో పాటు పదికిపైగా గేదెలు మృత్యువాత పడ్డాయి. వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన చీరాల పట్టణంలో 33 మున్సిపల్ వార్డులున్నాయి. 22 వేలకుపైగా **ఇళ్లు, లక్షకుపైగానే జనాభా నివసిస్తున్నారు. చుట్టు పక్కల** గ్రామాలు, పట్టణాల ప్రజలు ప్రతి పనికి నిత్యం చీరాల వస్తుంటారు. బాపట్ల జిల్లా కేంద్రం కావడంతో చీరాలలో ఆర్డీవో కార్యాలయం కూడా ఏర్పాటు చేశారు. అయితే మురుగు కాలువలు మాత్రం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పట్టణ ముఖ్య కూడళ్లలో కూడా ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన **పరిస్థితులు దాపురించాయి.**

అత్యధికంగా కార్మికులున్నా ఫలితం సున్నా..

మురుగు కాలువలు, **రోడ్లను** శుభ్రం **చేసేం**దుకు **గాను** మున్సి**పాలిటీలో** 33 పర్మినెంట్ కార్మికులు, 235 మంది (ఆబ్కాస్) కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిని పర్యవేక్షించేందుకుగాను ప్రతి సచివాలయంలో పనిచేసే శానిటరీ వెల్ఫేర్లు, శానిటరీ మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్లు, మున్సిపల్ డీఈతో పాటు మున్సిపల్ కమిషనర్ ఉంటున్నారు. వీరంతా పర్యవేక్షిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. కార్మికులు పనిచేస్తున్నట్లు, మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నట్లు శానిటరి మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది కలిసి ఫొటోలు తీసి అధికారులకు చేరవేస్తున్నారు. కానీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన మాత్రం చేయడంలేదు.

పక్క గోడలు కూడా లేవు..

కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్ల నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ వరకు నిర్మించిన ప్రధాన మురుగు కాలువకు కింద బేస్‌మెంట్, సైడ్‌వాల్స్ లేకపోవడంతో మురుగు నీరు పారుదల కూడా సక్రమంగా జరగడంలేదు. ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారాలు మురుగుతో కలిసి పేరుకుపోవడంతో పొలాల్లో గ్రాసం తినేందుకు వెళ్లే గేదెలు వాటిలో ఇరుక్కుపోయి మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే పదికిపైగా గేదెలు ఆ కాలువలో కూరుకుపోయి బయటకురాలేక చనిపోయాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు. అంతేకాక మురుగునీరు భూమిలోకి ఇంకిపోయి సమీపంలో నివాసముంటున్న ప్రజలు, వ్యవసాయం చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు భూమిలో కలిసిపోవడంతో పంటలు సక్రమంగా పండడంలేదని రైతులు, భూమిలో నుంచి బోర్ల ద్వారా వచ్చే నీరు పచ్చగా వస్తున్నాయని వాడుకోవడటానికి ఉపయోగం పడడంలేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదభరితంగా..

చీరాల పట్టణంలో 10 మేజర్ కాలువలు, 15 మీడియం కాలువలు, 70 మైనర్ కాలువలున్నాయి. పట్టణంలోని ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే మురుగునీటిని సగం దండుబాట ప్రధాన మురుగుకాలువకు, సగం కుందేరు కాలువకు తరలించే చర్యలను అధికారులు చేపట్టారు. అయితే ఎంతో ప్రధానమైన దండుబాట ప్రధాన మురుగుకాలువ ప్రమాద భరింతగా మారింది. కొత్తపాలెం నుంచి ప్రారంభమైన కాలువ కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్ల వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవున ఎనిమిది నుంచి పది అడుగుల లోతున నిర్మించారు. ఈ కాలువపై మూతలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దండుబాట రోడ్డుకు ఆనుకుని ఉండే ఈ కాలువ రోడ్డుకు రెండు అడుగులు డౌన్‌లో ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నట్లయితే క్షణాల్లో కాలువలోకి వెళ్లిపోవాల్సిందే. ఇటువంటి సంఘటన వారం రోజుల క్రితం చోటు చేసుకుంది. రాత్రి సమయంలో ఓకారు ప్రమాదవశాత్తు కాలువలోకి దూసుకుపోయింది. వెంటనే వారు బయటకు దూకడంతో పెనుప్రమాదం తప్పింది. మరుసటి రోజు కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు. గతంలో ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ కాలువలో జారిపడి చినిపోయారు.



సైడ్‌వాల్స్ లేక ప్రమాద భరితంగా ఉన్న చెత్తాచెదారాలతో నిండిన కాలువలోకి దిగకుండా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న గేదెలు



కాలువపై నడిచేందుకు స్థానికులు కాలువపై తాత్కాలికంగా ఏర్పాటుచేసుకున్న స్తంభాలు

మురుగుకాలువకు రెండు వైపులా ఐరన్ తీగలు వేయిస్తాం



దండుబాట రోడ్డులోని ప్రధాన మురుగుకాలువ ప్రమాదభరితంగా ఉన్న విషయం గురించి మున్సిపల్ డీఈ రఘురాంను సాక్షి వివరణ కోరగా మురుగు కాలువ ప్రమాదభరితంగా ఉన్నమాట వాస్తవమేనని చెప్పారు. అయితే తాను బాధ్యతలు చేపట్టి రెండు నెలలు మాత్రమే అయిందని దండుబాట కాలువకు రెండువైపులా ఇనుప తీగలు వేయిస్తామని చెప్పారు.

– టి. రఘురాం, మున్సిపల్ డీఈ

బల్లికురవ, కేవీపాలెంలో ఆధార్ క్యాంపులు

బల్లికురవ: బల్లికురవ, మక్కెనేనివారిపాలెం గ్రామ సచివాలయాల్లో గురువారం నుంచి వారం రోజులపాటు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవలో గురు, శుక్ర, శనివారాల్లో 11 పంచాయతీలకు కొమ్మినేని వారిపాలెంలో సోమ, మంగళ, బుధ, గురువారాల్లో 10 పంచాయతీలకు క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. ఈ క్యాంపును సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో శిక్షణ

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్థానిక వర్ణికా పెయింటింగ్ అండ్ స్కల్పర్ పాఠశాల లో ఈనెల 24 నుంచి 30 వతేది వరకు దళిత విద్యార్థులకు డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ నిర్వహించనున్నారు. ఆ పాఠశాల డైరెక్టర్ కత్తి బాలకోటేశ్వరరావు బుధవారం తెలిపారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు భోజన వసతితో పాటు, పెయింటింగ్, డ్రాయింగ్‌కు కావాల్సిన వస్తువులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన గ్రానైట్ లారీ

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని బుధవారం మైన్స్ ఆర్ఐ రాజు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ ముడి, మీటరు రాళ్ల శ్లాబులు తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. పర్మిట్ తోనే ఎగుమతులు చేపట్టాలని అక్రమంగా తరలిస్తే పెనాల్టీ తోపాటు లారీలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

1530 ఎకరాల్లో రీ సర్వే

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని గురిజేపల్లి గ్రామంలో 1530 ఎకరాల్లో రీసర్వే నిర్వహించనున్నట్లు మండల సర్వేయర్ వినోద్ బుధవారం తెలిపారు. గత రెండు రోజులుగా గ్రామంలో పొలాలను రీసర్వే జరుపుతున్నట్లు చెప్పారు. సచివాలయ సర్వేయర్ హరి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మొండి బకాయిలతో తిప్పలు



చీరాల మండల పరిషత్ కార్యాలయం

చీరాల టౌన్: ఇంటిపన్ను వసూళ్లు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చీరాల మండలానికి ఇంటిపన్ను వసూళ్లు 2024–25 సంవత్సరాలకు రూ.2.95 కోట్లు ఉండగా కేవలం రూ.63,40,220 మాత్రమే వసూళ్లు చేశారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇంటి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి సమీపిస్తున్నా సగం కూడా పన్ను వసూళ్లు చేయలేకపోయారు. అన్ని గ్రామ పంచాయితీలకు పంచాయితీ సిబ్బంది, బిల్లు కలెక్టర్లు ఇరత సిబ్బంది ఉన్నప్పటికీ పాత బకాయిలను వసూళ్లు చేయటంలో విఫలమయ్యారు. చీరాల మండలానికి సంబంధించి రూ.2.3 కోట్లు పేరుకుపోయింది. గడిచిన ఐదేళ్లలో గ్రామ పంచాయితీలు అన్నీ 90 శాతానికి పైగా ఇంటి పన్నులు చెల్లించారు. కానీ ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో ప్రజలు పన్నులు చెల్లించడం లేదు. ఈ విషయమై ఈఓఆర్డీ రామకృష్ణను వివరణ కోరగా మార్చి నెలాఖరులోపు ఇంటి పన్నులు వసూళ్లు పూర్తి చేయటంతో పాటు పాత బకాయిలను సైతం వసూళ్లు చేయాలని పంచాయితీల సిబ్బందిని ఆదేశించామన్నారు. అయితే పంచాయితీలకు సిబ్బంది కొరత కారణంగా వసూళ్లు చేయించలేకపోయామని.. మార్చి 31లోపు 90శాతం పన్నులు వసూళ్లు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని వివరించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



మార్టూరు సమావేశంలో పాల్గొన్న నాయకులు

మార్టూరు: రైతులు సాగుచేసిన ధాన్యం, కందులు, మినుము, మొక్కజొన్న, పంటల ఉత్పత్తులను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల రైతు సంఘం సమావేశంలో మాట్లాడారు. స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జనవరి 26వ తేదీ మండలంలోని రైతులు ట్రాక్టర్లు, బైకుల ద్వారా ర్యాలీ నిర్వహించి నిరసన తెలపాలని మండల కమిటీ తరఫున ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, కృష్ణమూర్తి ఇతర నాయకులు వై. రాంబాబు, బి. సూరిబాబు, మోహన్ రావు, సాంబశివరావు, శేషాద్రి, సాంబయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

బీమా నగదు చెక్కు పంపిణీ



నామినీకి బీమా నగదు చెక్కును అందిస్తున్న ఎస్‌బీఐ రీజియన్ మేనేజర్ గుణ్ణేశ్వరరావు

చీరాల అర్బన్: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో అనేక బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఎస్‌బీఐ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ మేనేజర్ గుణ్ణేశ్వరరావు అన్నారు. బుధవారం చీరాల ఎస్‌బీఐ పట్టణ శాఖలో స్థానిక పాపరాజుతోటకు చెందిన బత్తిన సీతారావమ్మ ఎస్‌బీఐ ఖాతా ద్వారా ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకంలో రూ.436లు చెల్లించారు. ఆమె మరణించగా కుటుంబ సభ్యులకు బీమా నగదు రూ.2లక్షల చెక్కును కుటుంబ అందించారు. బ్యాంకు సిబ్బంది ఫోన్ చేసి అకౌంట్ వివరాలు అడగరని, ఎవరైనా ఫోన్ చేస్తే బ్యాంకుకు వచ్చి మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ వెంకటరావు, ఎఫ్ఐసీ మేనేజర్ శ్రీనివాసరావు, టౌన్ బ్రాంచి మేనేజర్ బదరీనాథ్, అకౌంట్ సర్వీస్ మేనేజర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ ఫార్మర్ రిజిస్ట్రేషన్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో టెక్నికల్ సరిత

అద్దంకి: త్వరలో ప్రతి రైతుకూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాల్లో మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో రైతుకు ఒక ఐడీ నంబర్ ఇస్తామని.. దానితోనే ప్రతి ప్రభుత్వ పథకం అనుసంధానం అవుతుందన్నారు. ఈ సంఖ్య ద్వారానే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. తరువాత ఆయా గ్రామాల్లోని శనగ పంటను పరిశీలించి తగు సూచనలు సలహాలను ఇచ్చారు. వ్యవసాయ సహాయకులు కోటేశ్వరరావు, అనూష, రైతులు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలో అధికంగా సాగు చేసిన వరి, మిరప, శనగ రైతులు తెగుళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. కారంచేడు, కుంకలమర్రు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ-క్రాప్ ఫిబ్రవరి 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

చీరాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నేషనల్ పెస్ట్ సర్వలెన్స్ సిస్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఏవో టెక్నికల్ అధికారి సరిత పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ, ఈపురుపాలెం గ్రామ పొలాల్లో నిర్వహించారు. రైతులు నేరుగా పొలాల్లోకి వెళ్లి తమ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసిన వెంటనే వాటి నివారణ చర్యలు తెలుస్తాయని.. వెంటనే మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని రైతులకు వివరించారు. దీని ప్రకారం ప్రతిరైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించడం జరుగుతుందని చెప్పారు. పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని యూనిక్ నంబర్‌ను పొందాలని చెప్పారు. వీఏఏలు ధీరజ్, ఆఫియా, రైతులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల నియామకం

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల వివరాలను బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. బండికళ్ళ నరేష్ (యూత్ వింగ్), సీతామహాలక్ష్మి (మహిళా విభాగం), కావూరి రమణారెడ్డి (రైతు విభాగం), సాదు రాఘవ (బీసీ సెల్), సల్లూరి అనిల్ (ఎస్సీ సెల్), పాలపర్తి నాగేశ్వరరావు (ఎస్టీ సెల్), షేక్ అల్లాభక్షు (మైనార్టీ సెల్), గుర్రం జాన్సన్‌బాబు (క్రిస్టియన్ మైనార్టీ సెల్), గోనబోయిన వెంకటేశ్వర్లు (స్టూడెంట్ వింగ్), మచ్చా సువార్త (పంచాయతీరాజ్ వింగ్), తోకల అనిల్ కుమార్ (మున్సిపల్ వింగ్), బడుగు విమలాకర్ (ఆర్టీఐ వింగ్), బెజవాడ నాగ ప్రశాంత్ (వలంటీర్స్ వింగ్), బుర్ల సాంబశివరావు (గ్రీవెన్స్‌సెల్), చిన్ని లీలాధర్(వాణిజ్య విభాగం), బండారు జ్వాలానరసింహం (వీవర్స్ వింగ్), బోరా జగ్గారావు (వైఎస్సార్‌టీ యూసీ), జె.భూలక్ష్మి (అంగన్‌వాడీ వింగ్), రాజు వెంకటేశ్వరరెడ్డి (లీగల్ సెల్), మండా గిరీష్ (కల్చరర్ వింగ్), షేక్ మహబూబ్ (సోషల్ మీడియా వింగ్), బి.విష్ణువర్ధన్ రెడ్డి (ఐటీ వింగ్), ఎం.శ్యామ్ ప్రకాష్ (దివ్యాంగుల వింగ్), డాక్టర్ ఐ.బాబూరావు (డాక్టర్స్ వింగ్), కోండ్రు రవీంద్రబాబు (పబ్లిసిటీ వింగ్), తేళ్ల రాంబాబు (ఇంటలెక్చువల్స్ ఫోరం వింగ్), శిఖా సురేష్‌కుమార్ (బూత్ కమిటీ వింగ్).

కార్యకర్తలపై దాడులు చేస్తే సహించం



కొప్పరపాలెంలో మాట్లాడుతున్న కన్వీనర్

బల్లికురవ: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు, దౌర్జన్యాలు, దాడులు చేస్తే సహించేదని మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు హెచ్చరించారు. బుధవారం రాత్రి మండలంలోని కొప్పరపాలెం గ్రామం ఎస్సీ, బీసీ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల బీసీలపై కూటమి గ్రామ నేతలు దాడులు చేయటంతో వారందరినీ పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామాల వారీగా కమిటీల ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కృష్ణబాబు చెప్పారు. సూపర్ సిక్స్ హామీలపై ఎద్దేవా చేశారు. ఈ పర్యటనలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి అంకయ్య, స్థానిక నేతలు గన్నమనేని వెంకటరామిరెడ్డి, కొండెద్దు వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మేదరమెట్ల: వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమారి అన్నారు. గొడ్డువానిపాలెంలో బుధవారం వాహనదారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికలోడుతో కానీ అతి వేగంతో కానీ వాహనాలను పడపడం చట్టపరంగా నేరమన్నారు. మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ, వాహనదారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఆదిపూడిలో వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుసూదన రెడ్డి



ప్రభుదాసు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి

కారంచేడు: పార్టీ జెండాలు మోసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి అన్నారు. బుధవారం మొదటి సారిగా మండలంలోని ఆదిపూడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో పార్టీ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాట్లాడారు. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అధిష్టానం ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ చల్లా సుబ్బారెడ్డి సోదరుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి ఇటీవల మృతిచెందగా ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, సర్పంచ్ నాగండ్ల నాగరాజు, ఉపసర్పంచ్ కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, దగ్గుబాటి రామకృష్ణ, పోతిన సుబ్బారావు, యార్లగడ్డ పాపారావు, అడపా సుధాకరరెడ్డి, గోగినేని సతీష్, కొడాలి ధర్మానంధరావు, సోషల్ మీడియా కోకన్వీనర్ చల్లా చలమారెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుదాసుకు నివాళి

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు రేపూరి ప్రభుదాసుకు పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం మండలంలోని కడవకుదురు గ్రామంలోని ప్రభుదాసు దశదినకర్మకు ఆయన హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ధనరాజ్‌తో మాట్లాడారు. మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, కొల్లా వెంకట సుబ్బారావు, మారెళ్ళ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పాదర్తి ప్రకాష్, కొండూరి గోవింద్ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామర్ పుస్తకాల పంపిణీ

జె.పంగులూరు: మండలంలోని నూజిల్లపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను పంపిణీ చేశారు. తాటి ఇందిరా మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టైమ్స్) తరఫున పూనాటి రవీంద్ర, తాటి సరోజిని.. బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి టైమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున గ్రామర్ పుస్తకాలు అందిస్తున్నట్లు హెచ్‌ఎం కేమా వీరాంజనేయులు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

జె.పంగులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్పెషల్ ఆఫీసర్ ఎం. అనంతరాజు ఆధ్వర్యంలో మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశంలో నిర్వహించారు. పీఆర్ఏఈ గడ్డం హనుమంతురావు మాట్లాడుతూ 5.6 కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు, 1673 మీటర్లు సైడ్ డ్రైనేజ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి 24 పనులకు రూ. 57 లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఎన్ని గృహాలు పూర్తి చేసినట్లు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కె. స్వరూపరాణి, కార్యదర్శులు పాల్గొన్నారు.